పచ్చని అడవులు బుగ్గి

- నిలువునా కాలిపోతున్న వృక్షాలు
- భారీ ఎత్తున వన్యప్రాణులు, పక్షుల మృత్యువాత

పెనుకొండ/పెనుకొండ రూరల్: ఎండా కాలం వచ్చింది.. ఎండలు మండుతున్నాయి.. కనుచూపు మేర చూసినా పచ్చిక కనిపించదు.. అడవుల్లో ఉన్న చెట్టుచేమకూ నిప్పుపెడుతుండడంతో నిలువునా కాలిపోతున్నాయి. దీంతో వన్యప్రాణులు, పక్షులు ఎన్నో మృత్యువాత పడుతున్నాయి. అయినా అటవీ అధికారులు చోద్యం చూస్తున్నారేతప్పా.. పల్లెల్లో అటవీప్రాంతం కాలిపోతే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించలేదు. ఆకతాయిలు, కాపరులు అగ్గి పెట్టడంతో పెనుకొండ అటవీ ప్రాంతం కిలోమీటర్ల మేర కాలిపోయింది.

పెనుకొండ అటవీశాఖ రేంజ్ 32వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. పెనుకొండ, చిలమత్తూరు, మడకశిర తదితర ప్రాంతాల్లో గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఎటుచూసినా పచ్చదనం కనిపిస్తుంది. ప్రభుత్వ పథకాలతో సైతం అనేక ప్రాంతాల్లో అటవీ అధికారులు మొక్కలు నాటించడం, వన్యప్రాణుల కోసం చెక్‌డ్యాంల నిర్మాణం, కందకాలు, ఫారంపాండ్లు తవ్వించారు. దీంతో ఏపుగా పెరిగిన పచ్చదనంతో వన్యప్రాణులు, నెమళ్లు, చిరుతలు, జింకలు, ఎలుగుబంట్లు, అలుగులు, అడవి పందులు, పక్షులు భారీగా అడవిలో జీవిస్తున్నాయి. అయితే వేసవి ఆరంభంలో ఒక్కసారిగా మంటలు చెలరేగుతుండడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.


కాలిపోతున్న అటవీ ప్రాంతం

ప్రస్తుతం 5 వేల హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం కాలిపోయినట్లు అటవీశాఖ సిబ్బంది చెప్తున్నారు.

ముందస్తు చర్యలు ఏవీ?

వేసవి ఆరంభంలోనే అడవులకు నిప్పు పెడతారని తెలిసీ కూడా అటవీఅధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయడంలో ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని, ఈ చర్యలు చేపడితే అగ్గిపడినా అది కొంత మేరకే పరిమితమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో ప్రధానంగా తండాల్లో సమావేశాలు నిర్వహించి, వారి సహకారం తీసుకోవడం, 3 నెలల పాటు సిబ్బందితో పాటు, ఇతరులను నియమించుకొని అడవులపై ప్రత్యేక నిఘా ఉంచడం, పశువుల కాపరులను హెచ్చరించడం వంటివి చేయలేదు.

అడవులను కాపాడుకోవాలి



అటవీశాఖ అధికారులు అడవులను కాపాడాలి. అడవుల సంరక్షణకు వేసవికి ముందే తగిన చర్యలు తీసుకోవాలి. అడవులకు నిప్పు పడడం వల్ల లక్షలాది సంఖ్యలో జీవరాశులు మృత్యువాత పడుతున్నాయి. పలుమార్లు అటవీశాఖ అధికారులు విన్నవించుకున్నా స్పందన ఏ మాత్రం లేదు.

- హరిలాల్‌నాయక్, నేషనల్, హ్యూమన్‌రైట్స్ కల్చర్, అండ్ నేచర్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పెనుకొండ

చర్యలు తీసుకుంటాం



అడవులకు నిప్పు పడకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. ఎవరైనా నిరుద్యోగులు ముందుకొస్తే అడవుల సంరక్షణకు రూ. 8 వేలు వేతనం ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులను నియమిస్తాం. నిప్పు పెట్టే వారి సమాచారం తెలిస్తే కేసులు పెట్టి జైలుకు పంపుతాం. ఫైర్ లైన్స్ ఏర్పాటులో శాఖాపరమైన ఇబ్బందులు ఉన్నాయి. పెనుకొండ రేంజ్ 4 నియోజకవర్గాలతో ముడి పడి ఉంది.

- శ్రీనివాసరెడ్డి, రేంజర్, పెనుకొండ

క్లుప్తంగా

గురుకుల ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: దొమ్మరహట్టి గ్రామం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 2023–2024లో ఐదో తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మొత్తం 80 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో 70 సీట్లు ఎస్సీలు, 5 ఎస్టీలు, 4 సీట్లు బీసీలు, ఒకటి ఓసీలకు రిజర్వేషన్ చేశారన్నారు. ఈ నెల 24 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 58 మంది గైర్హాజరు

మడకశిర: నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 58 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నియోజకవర్గంలోని మొత్తం 6 కేంద్రాల్లో 1,800 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,742 మంది మాత్రమే హాజరైనట్లు అధికారులు తెలిపారు. మడకశిరలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 444 మందికి గాను 431 మంది విద్యార్థులు హాజరయ్యారు. వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 292 మందికి గాను 283 మం, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 359 మందికి గాను 344 మంది హాజరయ్యారు. అగళిలో 243 మందికి గాను 236 మంది, గుడిబండలో 215 మందికి గాను 206 మంది, అమరాపురంలో 247 మందికి గాను 242 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

తక్షణసాయం పంపిణీ


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

లేపాక్షి: మండలంలోని గలిబిపల్లికి చెందిన బి.నాగరాజు కుటుంబానికి సర్పంచ్ ఆదినారాయణ, కార్యదర్శి నాగేంద్ర వైఎస్సార్ బీమా కింద తక్షణ సహాయం రూ. 10 వేలు నగదు శుక్రవారం పంపిణీ చేశారు. నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద మృతుని కుమారుడు శ్రీనివాసులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంజినరెడ్డి, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూలుకు చర్యలు

మడకశిరరూరల్: మండలంలోని 16 గ్రామ పంచాయితీల్లో వంద శాతం ఇంటి, నీటి పన్ను వసూలకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఈఓఆర్డీ శైలజ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు మెళవాయి, కదిరేపల్లి, చందకచెర్లు, గౌడనహళ్లి, జీవీ పాళ్యం, కల్లుమర్రి, సీ కొడిగేపల్లి పంచాయతీలో దాదాపు వంద శాతం పన్ను వసూలు చేశామన్నారు. ఆమిదాలగొంది, బుళ్లసముద్రం, ఛత్రం, వైబీహళ్లి, గోవిందాపురం, హరేసముద్రం, మణూరు, గుండుమల, ఆర్ అనంతపురం పంచాయితీలో 50 శాతం పైగా పన్నులు వసూలు చేశారన్నారు. ఈ నెల లోపు వంద శాతం పన్నులు వసూలు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఆమె ప్రజలను కోరారు.

ప్రెస్‌క్లబ్ ప్రారంభం


ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గుడిబండ: మీడియా సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్‌ఐ మునిప్రతాప్, జెడ్పీటీసీ భూతరాజు, సర్పంచ్ కరుణాకర్‌గౌడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సోదరుల సేవలు వెలకట్టలేనివన్నారు. శశిధర్, విలేకరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు


ప్రమాదానికి గురైన కారు

సోమందేపల్లి: పేటకుంట సమీపంలోని జాతీయ రహదారిపై కారు డివైడర్‌ను ఢీకొనింది. శుక్రవారం అనంతపురం వైపు నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు టైరుపంక్చర్ అయ్యి, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనింది. దీంతో కారు ముందుభాగం దెబ్బతినింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం వారు మరో వాహనంలో బెంగళూరు వెళ్లారు.

పిచ్చిమొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

హిందూపురం టౌన్: పట్టణంలోని వ్యవసాయాధికారి కార్యాలయ ఆవరణలో అధికారులు పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ నెల 16న సాక్షి దినపత్రికలో 'అపరిశుభ్రంగా వ్యవసాయ కార్యాలయం' అనే కథనం ప్రచురితం కావడంతో ఆ శాఖ ఏడీ అల్తాఫ్ అలీఖాన్ స్పందించారు. వ్యవసాయాధికారి ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలో శుక్రవారం సిబ్బంది కార్యాలయ ఆవరణంలో పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలను, చెత్తాచెదారం తొలగించారు.



మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతిపాదనలు


విజయవాడలోని సచివాలయంలో ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, తదితరులు

హిందూపురం: పట్టణాభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీకి ప్రత్యేకంగా రూ.66 కోట్లు విడుదలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా సంబంధిత అధికారులకు అందజేశారు. శుక్రవారం విజయవాడలోని సచివాయలంలో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను వారు కలసి ప్రతిపాదనలు, వినతులను అందజేసి నిధుల అవశ్యకతను వివరించారు. అలాగే పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న జామియా మసీదు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించారు. కార్యక్రమంలో జామియా మసీద్ ముతవల్లి ఖలీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్ లతీఫ్ సెట్, మార్కెట్ చాంద్ బాషా, యువజన విభాగం అధ్యక్షుడు జిల్లా లోకేష్ వాల్మీకి, బషీర్, ఫరూక్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి

హిందూపురం: పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన న్యాయవాది నవీన్‌పై కొందరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొన్ని రోజులుగా కల్తీకల్లు అరికట్టడానికి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తుండడంతో కొందరు కక్ష కట్టి శుక్రవారం సాయంత్రం కోర్టు నుంచి బయటకు వస్తున్న సమయంలో కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడటంతో గొంతు, చేతికి గాయాలయ్యాయన్నాడు. దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు.

19న క్రీడా ఎంపికలు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 19న స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా ఎంపికలు జరగనున్నట్లు సంస్థ సెక్రటరీ రామచంద్ర శుక్రవారం తెలిపారు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, చెస్, హ్యాండ్‌బాల్, కరాటే, టెన్నిస్, చెస్, కబడ్డీ, యోగా తదితర ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్ 14, 16, 19 వయసున్న బాలబాలికలు మాత్రమే హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 9063666366లో సంప్రదించాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

- పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్

మడకశిరరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఆయన శుక్రవారం ఆర్ అనంతపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనులు, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు, స్పందన అర్జీలు తదితర వాటిపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందలేదని ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు. సచివాలయంలో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. క్షేత్ర స్థాయి ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించాలన్నారు. రెవెన్యూ రికార్డులను పారదర్శకంగా ఉంచుకోవాలన్నారు. యూనిఫారంతో విధులకు హాజరుకావాలని ఉద్యోగులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్ అనంతపురం సచివాలయంలో వివరాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

భూసేకరణ వేగవంతం చేయండి

మడకశిర మండలంలో అభివృద్ధి పనులకు అవసరమయ్యే భూమిని వేగవంతం సేకరించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మడకశిర తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని తుముకూరు నుంచి మడకశిర మండల మీదగా రాయదుర్గం వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్నారని, ఇందుకు మడకశిర మండలంలో అవసరమయ్యే భూమిని సేకరించాలన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

పెనుకొండ రూరల్: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని సబ్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం మావటూరు పంచాయతీ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సేవలు వేగవంతం చేయాలని, స్పందనలో అందే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సంక్షేమ పథకాల స్టిక్కర్లను సచివాలయం ముందు భాగంలో ప్రజలకు కనిపించేలా అతికించాలన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

పావగడ: రోడ్డు పది కాలాల పాటు ఉండేలా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప కాంట్రాక్టర్‌కు సూచించారు. పట్టణంలోని చళ్లకెరె క్రాస్ వద్ద పావగడ–కంబదూరు రోడ్డు పనులకు ఆయన శుక్రవారం భూమి పూజ చేశారు. చళ్ళకెరె క్రాస్ నుంచి కంబదూరు కర్ణాటక సరిహద్దు వరకు రూ.9.48 కోట్లతో తారు రోడ్డు నిర్మించనున్నారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్, మున్సిపల్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఏ శంకరరెడ్డి, కౌన్సిలర్లు రాజేశ్, టెంకాయల రవి, కాంట్రాక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

మంత్రులను కలిసిన నాయకులు

మడకశిర: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామితో వెళ్లి పలువురు మంత్రులను కలిశారు. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కలిసి మడకశిర మున్సిపాలిటీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్‌ను కూడా వారు కలిసి పట్టణంలోని పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామిని కూడా వారు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సమస్యలను పరిష్కరించడానికి మంత్రులు హామీ ఇచ్చినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మంత్రులను కలిసి వారిలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తనయుడు జయరాజ్, నాయకులు రాజేష్, అంజన్‌కుమార్ యాదవ్, సైపుల్లా, సుధీర్‌రెడ్డి ఉన్నారు.


మంత్రి ఉషశ్రీచరణ్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టండి

రొళ్ల: ఉపాధి హామీ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో డీఆర్పీలు, వీఎస్‌ఏలు కూలీలు, రైతులతో సమన్వయం చేసుకుని పక్కాగా సామాజిక తనిఖీ చేపట్టాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఉపాధి హామీ, పంచాయతీరాజ్, పట్టు పరిశ్రమ, సర్వశిక్ష అభియాన్, సోషల్ ఫారెస్ట్, పశు వైద్య శాఖ తరఫున చేపట్టిన పనులకు సంబంధించి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్పీ మాట్లాడుతూ మండలంలో 2021 ఏప్రిల్ 1వ తేది నుంచి 2022 మార్చి 31 వరకూ ఉపాధి హామీ కింద 801 పనులకు గాను రూ.6.97 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. వీటిపై సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలన్నారు. కూలీలు, రైతులు సామాజిక తనిఖీ బృందం వారికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పంచాయతీల వారిగా రికార్డులను డీఆర్పీలు, వీఎస్ఏలకు అప్పగించారు. ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏపీఓ నాగరాజు, పీఆర్ ఏఈ నాగన్న, అటవీశాఖ ఏబీఓ సంజీవరాయుడు, డీఆరీలు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, టీఏలు, ఎఫ్ఏలు, వీఎస్ఏలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ

ఈవీఎంలపై యువజన ఓటర్లకు అవగాహన

పావగడ: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో ఈవీఎంలపై యువజన ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపన్మూల వ్యక్తి బీఆర్‌పీ దేవరాజ్ ఈవీఎం సాంకేతిక అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎంలపై అనేక మంది కి అనుమానాలు ఉండడం సహజమని అయితే ఇటీవల కొత్తగా వచ్చిన ఈవీఎం ల సాఫ్ట్‌వేర్‌ను హ్యాక్ చేయడం సాధ్యం కాదన్నారు. విద్యార్థులు తమ గ్రామాల లోని ప్రజలకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఓ మారప్ప మాట్లాడుతూ ప్రతి ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించు కోవాలని సూచించారు. స్వీప్ సంస్థ ప్రతినిధులు ఎస్ బంగారులింగం, హరీశ్, కళాశాల ఈఎల్‌సీ సంచాలకులు ఎం మధుకుమార్ ,ఐక్యూఏసీ సంచాలకులు హెచ్ నాగరాజు, అధ్యాపకులు రామాంజినమ్మ, రాజణ్ణ, సీకే కిరణ్, ఎం మిను, పద్మనాభ పాల్గొన్నారు.


ఓటు ఎలా వేయాలో తెలియజేస్తున్న అధికారులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పరిగి: మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని, అప్పుడే సాధికారత సాధ్యమని వక్తలు తెలిపారు. శుక్రవారం గౌరవనహళ్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలో మహిళా చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీటీ ఉరవకొండ, మడకశిర రీజినల్ డైరెక్టర్లు కృష్ణారెడ్డి, మల్లికార్జున మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి అందరూ తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, హెచ్‌ఎం జగదీష్, ఏటీఎల్ నారాయణస్వామి, దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నారాయణ, సీఓలు రామకృష్ణ, మౌనిక, సాలమ్మ, సీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ కృష్ణారెడ్డి

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఆస్తి, ఖాళీ జాగా పన్నులపై వన్‌టైం సెటిల్‌మెంట్(ఏకమొత్తం) ద్వారా వడ్డీ మాఫీ అవకాశం కల్పించామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31లోపు వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పన్నులు చెల్లించి వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హిందూపురం పట్టణంలో వన్‌టైం సెటిల్‌మెంట్, సాధారణ పన్నులు చెల్లింపులకు మున్సిపాల్టీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని సచివాలయాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటర్–1 తెలుగుతల్లి సర్కిల్ మీసేవ కేంద్రం, దండురోడ్డు సచివాలయాల వద్ద 1, 2, 32 నుంచి 38 సచివాలయ వార్డులు, కౌంటర్–2 చిన్న మార్కెట్‌వద్ద ఉన్న పాతఅన్న క్యాంటీన్ సచివాలయంలో 20వ వార్డు 22, 23, 25 నుంచి 28 వార్డు వరకు కౌంటర్–3 నానెప్ప నగర్ కల్లూరు సుబ్బారావు మార్కెట్‌లోని సచివాలయంలో 8 నుంచి 12వ వార్డులతోపాటు 15, 16 వార్డులు, కౌంటర్–4 హౌసింగ్‌బోర్డు సడ్లపల్లి సచివాయంలో 13, 14వ వార్డులతో పాటు 17 నుంచి 19 వార్డులు, కౌంటర్– 5లో శాంతినగర్‌లోని ఆర్టీసీ కాలనీ–2 సచివాలయ వార్డులు 3, 4, 5, 39, 40 కేటాయించామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అన్ని వార్డులకు సంబంధించి పన్నులు చెల్లించవచ్చన్నారు. అంతేగాక సీడీఎంఏ యాప్, పురసేవ, నగరసేవ, నెట్ బ్యాంకింగ్, యూపీఏల ద్వారా కూడా పన్నులు చెల్లించవచ్చని ఆయన వివరించారు.

ఎమ్మెల్సీకి ఘన సన్మానం


ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు

హిందూపురం: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన ఎం.వి. రామచంద్రారెడ్డిని హిందూపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఓట్ల లెక్కింపు పూర్తయి గెలుపొందినట్లు డిక్లరేషన్ స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆఫీసు నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని శుభాకాంక్షలు తెలియజేసి శాలువా వేసి పూలమాలలతో సత్కరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధ్యాయ సంఘాల మిత్రులు, పార్టీ నాయకుల కృషితో గెలుపు సాధ్యమైందని ఎమ్మెల్సీ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరేంద్రుడు, తిమ్మారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం

అమరాపురం: పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరమవుతాయని వలస గ్రామ సర్పంచ్ నాగవేణి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పంచాయతీ సిబ్బందితో గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె గ్రామస్తులకు సూచించారు.

సామాజిక రుగ్మతలు నియంత్రించాలి


మాట్లాడుతున్న ఏడీజే శైలజ

హిందూపురం: సామాజిక రుగ్మతల నియంత్రణలో సామాజిక సేవా సంస్థలు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని హిందూపురం అదనపు జిల్లా జడ్జి శైలజ సూచించారు. శుక్రవారం ఏడీజే ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో సామాజిక సేవా సంస్థ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీజే మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, మహిళలు, పసిపిల్లలపై దాడులను నియంత్రించడంలో సామాజిక సేవకులు సమాజాన్ని చైతన్య పరచాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, అత్యాచారాలు. కల్తీ మద్యం. నేర ప్రవృత్తి, ట్రాఫికింగ్, అసహజ లైంగిక కార్యకలాపాలు, దొంగతనాలు అరికట్టడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం నగారా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్, వృక్ష రక్షకుడు భాస్కర్‌రెడ్డి, వృద్ధాశ్రమం నాగిరెడ్డి, నాగరాజు, సిక్కువెహిందర్‌సింగ్. పల్వాన్ ధర్‌సింగ్, మౌలానా షాబుద్దీన్, ముతవల్లీ ఖలీల్, న్యాయవాదులు కళావతి, నవీరా, లోక్ అదాలత్ సభ్యులు శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ రోడ్ షో


రోడ్ షో లో కేంద్ర మంత్రి నారాయణస్వామి, రాష్ట్ర మంత్రి అశోక్ కుమార్

పావగడ: బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అశోక్ కుమార్, కేంద్ర మంత్రి నారాయణస్వామి పావగడలో శుక్రవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌కే రంగ మందిరం నుంచి చళ్లకెరె క్రాస్ వరకు వందలాది మంది జనం మధ్య రోడ్ షో సాగింది. ఇందులో భాగంగా బీజేపీ కార్యకర్తలు, అభిమానులు 500 బైకుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు జ్యోతులు మోశారు. డ్రమ్ముల వాద్యాలకు దీటుగా యువకులు గంతులు వేశారు. బీజేపీ టికెట్ ఆశావహులు లాయర్ కృష్ణానాయక్, కొత్తూరు హనుమంతరాయప్ప, నాయకులు డా వెంకట్రామయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు రవి శంకర నాయక్, అశోక్, బీజేపి జిల్లా కార్యదర్శి రవి, మాధవరెడ్డి, కోటీశ్వరరెడ్డి, బ్యాడనూరు శివ తదితరులు పాల్గొన్నారు.